'డబుల్' ఇండ్లల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

డబుల్‌బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులతో సమావేశమైన ఎమ్మెల్యే వివేకానంద్,కార్పొరేటర్ బాలాజీనాయక్

దుండిగల్,జనవరి13 : నిజాంపేట్, బాచుపల్లిలోని డబుల్ బెడ్రూం ఇండ్లల్లో మౌలిక వసతులను కల్పిస్తామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తెలిపారు. సోమవారం పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాచుపల్లి, నిజాంపేట్ డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయాల లబ్ధిదారులు ఎమ్మెల్యే కెపి వివేకానంద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాచుపల్లి, నిజాంపేట్ డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయాల వద్ద నెలకొన్న పలు సమస్యలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయాల వద్ద అధికారులతో సమావేశాలు నిర్వహించి, మౌలిక వసతులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులు ఇండ్లల్లోకి చేరుకునే విధంగా సౌకర్యాలు కల్పిస్తున్నామని ఇందులో భాగంగానే ఇప్పటికే బహదూర్‌పల్లి, డీ.పోచంపల్లి,దుండిగల్ డబుల్ బెడ్రూం ఇండ్లలోని లబ్ధిదారులకు అన్ని వసతులతోపాటు బస్సు సౌకర్యాన్ని కల్పించామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి బాచుపల్లి, నిజాంపేట్ డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులకు మౌలిక వసతుల కల్పనతో పాటు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేటర్ బాలాజీనాయక్, డబుల్ బెడ్రూం లబ్ధిదారులు పాల్గొన్నారు.



వేంకటేశ్వర స్వామికి ఎమ్మెల్యే కృష్ణారావు పూజలు

భోగి పండుగను పురస్కరించుకొని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో స్వామివారిని దర్శించుకొని పండితుల ఆశీర్వచనం పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అదే విధంగా జంగారెడ్డిగూడెంలో శ్రీమద్ది ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు స్వామివారి చిత్ర పటాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. –బాలానగర్, జనవరి 13

శిల్పారామంలో సంక్రాంతి సంబురాలు

నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

కొండాపూర్, జనవరి 13 : మాదాపూర్‌లోని శిల్పారామంలో సంక్రాంతి సంబురాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భోగిని పురస్కరించుకుని చిన్నారులకు భోగి పళ్ల ఉత్సవాన్ని నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా తాడేపల్లి సుబ్బలక్ష్మి బృందం సంక్రాంతి పాటలతో అలరించగా, రేణుక ప్రభాకర్ బృందం గోదా కల్యాణం కూచిపూడి నృత్య రూపకంలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

ఉరత్త చింతవ చైన్నై మాసపత్రిక ఆవిష్కరణ

తమిళ కవి సమ్మేళనంలో పాల్గొన్న వక్తలు

రవీంద్రభారతి,జనవరి13 : తెలంగాణ ప్రభుత్వం భాషా సాం స్కృతిక శాఖ భారతీయ ఉత్సవం, భారతీయర్ ప్రత్యేక సంచిక నామ్ ఉరత్త చింతవ, హైదరాబాద్ ఉరత్త చింతవ, చైన్నై ప్రసిద్ధ మాసపత్రికలు ఆవిష్కరణ కార్యక్రమం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉదయమ్‌రామ్, చిత్ర దర్శకుడు రాసి అపగప్పన్, కవి దయాళన్,ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్.చెల్లప్ప, హైదరాబాద్ తమిళ సంఘం అధ్యక్షుడు సాయికాంత్, శైవ సిద్ధాంత ఆచార్యులు ముత్తుస్వామిలు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి ఉరత్త చింతవ మాసపత్రికను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. ఉరత్త చింతవ మాసపత్రికను ఆవిష్కరించడం ఎంతో అభినందనీయమన్నారు. తమిళ సంప్రదాయాలను , ఆచారాలను, కల్చర్‌ను ఎక్కడ ఉన్నా పాటిస్తామని చెప్పారు. అనంతరం పలువురు తమిళ కవులు కవి సమ్మేళనం , ఉపాన్యాసాలు కవి రామతిలగం, సెక్రటరి శ్రీ రాజు, లౌడ్‌ఘాట్ హైదరాబాద్ ప్రెసిడెంట్‌లు కవిసమ్మేళనం నిర్వహించి వీక్షకులను మంత్రముగ్ధులను చేశారు.

ఐఐఎంసీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా

ఖైరతాబాద్, జనవరి 13 : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల (ఐఐఎంసీ)కి స్వయం ప్రతిపత్తి హోదా దక్కింది. 1973 స్థాపించిన ఐఐఎంసీ అంచలంచెలుగా ఎదుగుతూ నేడు 1700 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని ప్రిన్సిపాల్ కూర రఘువీర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీకాం (హానర్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, బిజినెస్ అనాలిటిక్స్), బీఎస్సీ (డేటా సైన్స్), బీబీఏ కోర్సులను అందిస్తోందన్నారు.

ఈ సంస్థ 2023లో 3వ సైకిల్‌లో 3.27 స్కోర్ సాధించి న్యాక్ ద్వారా ఏ ప్లస్ గ్రేడ్ సాధించిందన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 2025-26 విద్యాసంవత్సరం నుంచి పది సంవత్సరాల పాటు స్వయం ప్రతిపత్తి హోదా లో సేవలందిస్తుందని తెలిపారు. ఈ మేరకు కళాశాల చైర్మన్ వంగపల్లి విశ్వనాథం, కార్యదర్శి చల్లా ప్రసన్న కుమార్‌లు కళాశాల యాజమాన్యం, విద్యార్థులను అభినందించారు.


భోగి మంటల వేడుకల్లో శిల్పా బృందావన్ కాలనీ వాసులు

భోగి మంటలు.. రంగవల్లులు

మైలార్‌దేవ్‌పల్లిలో భోగి పండుగ సందర్భంగా భోగి మంటల్లో పాల్గొన్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎస్.వెంకటేష్ తదితరులు

నలగండ్ల అపర్ణగ్రాండే గేటెడ్ కమ్యూనిటీస్‌లో భోగిమంటల వద్ద సీనియర్ సిటిజన్లు

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న కాలనీ నాయకులు

శేరిలింగంపల్లి, జనవరి 13: శేరిలింగంపల్లిలో సంక్రాంతి పండుగ సంబురాలు ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. సోమవారం భోగి పండుగ నేపథ్యంలో వివిధ కాలనీ సంక్షేమ సంఘాలు, అపార్టుమెంట్స్ అసోసియేషన్‌లు, బస్తీలు, గేటెడ్ కమ్యూనిటీస్ కాలనీల్లో ఆయా అసోసియేషన్ల అధ్వర్యంలో భోగిమంటలు వేసి పండుగ చేసుకున్నారు. పూజా కార్యక్రమాలు నిర్వహించి నైవేధ్యాన్ని భోగిమంటలకు సమర్పించారు. నలగండ్ల అపర్ణ గ్రాండేలో చిన్న, పెద్ద కలిసి కుటుంబ సమేతంగా భోగి మంటల కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. పలు కాలనీల్లో స్థానిక కాలనీ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొంది విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. గుల్‌మోహర్‌పార్క్ కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు కాలనీ అధ్యక్షుడు షేక్ ఖాసీం బహుమతులు అందజేశారు.

బాలానగర్: కూకట్‌పల్లి నియోజకవర్గంలో భోగి వేడుకలను ఘనంగా జరిగాయి. సోమవారం కేపీహెచ్‌బీ కాలనీ రమ్యగ్రౌండ్స్‌లో శివశక్తి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 3వ ఫేజ్ భోగి మంటల కార్యక్రమాన్ని నిర్వహించారు. అదే విధంగా కేపీహెచ్‌బీకాలనీ 7వ ఫేజ్‌లో కాలనీవాసులు భోగి మంటల కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలలో శానిటేషన్ సిబ్బంది పాల్గొని వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో రమ్యగ్రౌండ్ మిత్ర బృందం సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ పరిధి సమతానగర్‌లో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో భోగి వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షులు రాంచందర్‌రావు, ఇంద్రారెడ్డి, సహాయకార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, రామకృష్ణ, నితిన్ రాకేశ్, రాజమణి, సీత, మాధవి, రంజిత్‌రెడ్డి, సంతోష్, బాలకృష్ణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్ : సంక్రాంతి సంబురాలలో భాగంగా భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు డివిజన్‌లలో భోగి మంటలు వేసి సందడి చేశారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శిల్పాబృందావన్ కాలనీలోని రామచంద్ర స్వామి ఆలయ ఆవరణలో , వివేకానందనగర్ డివిజన్ ఏఎస్ రాజు నగర్‌లో భోగి మంటల వేడుకలలో బీఆర్ఎస్ నేత కాలనీ వాసులు,ఆలయ అర్చకులతో కలిసి పాల్గొన్నారు. కాలనీలు, అపార్టుమెంట్‌ల ఎదుట ఈ సందడి కొనసాగింది. మియాపూర్ హరివిల్లులో భోగి సందర్భంగా ప్రత్యేక రంగుల ముగ్గులతో మహిళలు సందడి చేశారు.

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ పరిధి ఎన్‌సీఎల్ కాలనీవాసులు సోమవారం భోగి మంటలు కాగుతూ పండుగను ఘనంగా ప్రారంభించుకున్నారు. ఈ వేడుకల్లో బీజేపీ కుత్బుల్లాపూర్ కో-కన్వీనర్ పొత్తూరి శివాజీరాజు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీకాలనీ రమ్యగ్రౌండ్‌లో భోగి మంటల వేడుకల్లో పాల్గొన్న కాలనీవాసులు

కేపీహెచ్‌బీకాలనీ7వ ఫేజ్‌లో భోగి మంటల వేడుకల్లో పాల్గొన్న కాలనీ వాసులతో పారశుధ్య కార్మికులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి సమతానగర్‌లో భోగి మంటల వద్ద పాల్గొన్న కాలనీవాసులు

ఆల్విన్ కాలనీ డివిజన్ శిల్పాబృందావన్ కాలనీ కోదండ రామస్వామి ఆలయ ఆవరణలో భోగి వేడుకల్లో బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి సతీశ్‌రావు

సంతోష్‌నగర్ బస్తీలో ముగ్గుల పోటీలు

ఎర్రగడ్డ: ముగ్గుల పోటీల్లో పాల్గొని ముగ్గులు వేస్తున్న సంతోష్‌నగర్ బస్తీ మహిళలు

ఎర్రగడ్డ, జనవరి 13: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని డీవైఎఫ్ఐ జూబ్లీహిల్స్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో బోరబండ వీకర్‌సెక్షన్‌లోని సంతోష్‌నగర్ బస్తీలో మహిళలకు సోమవారం ముగ్గుల పోటీ నిర్వహించారు. సంతోష్‌నగర్‌తో పాటు పరిసర బస్తీలకు చెందిన మహిళలు ఈ పోటీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. జోన్ కమిటీ కార్యదర్శి దాది మల్ల కృష్ణ మాట్లాడుతూ పండుగ ఏదైనా మత సామరస్యాన్ని చాటే విధంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. ప్రకటించిన యూత్ డిక్లరేషన్ అమలుపర్చాలని, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ ప్రతినిధులు ఆనంద్, శ్రీను, విష్ణు, శివ, శైలజ, ఇంద్ర, నీతూ, రాధ, భారతి, సీపీఎం నాయకుడు సాయిశేషగిరిరావు, సంతోష్‌నగర్ బస్తీ అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

18న శిల్ప కళావేదికలో భయాన్

తెలుగు యూనివర్సిటీ, జనవరి 13 : గజల్స్ కథక్‌ల అరుదైన కలయికతో కూడిన ప్రదర్శన జనవరి 18న సాయంత్రం 7గంటలకు భయాన్-ఏ-గాలిబ్ శీర్షికతో కల్యాణ్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ట్రస్టు సీఈఓ డాక్టర్ కౌస్తుభ్ ధమాల్ వెల్లడించారు. రెడ్‌హిల్స్‌లో గల ఫ్ట్యాప్సీలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో షో నిర్మాత సుధాంశు మణితో కలిసి కౌస్తుబ్ ధమాల్ వివరాలను వెల్లడించారు. కొత్త తరానికి సంగీత కచేరీల ద్వారా గజల్స్‌ను చేరువచేయాలనే లక్ష్యం తో ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్ వేదికగా ప్రతిష్టాత్మకంగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మనోహరమైన గజల్ పద్యాలు మంత్రముగ్ధులను చేసే కథక్ నృత్యంతో ఉర్దూ సాహిత్యంలో అత్యంత ప్రసిద్ధ వ్యక్తుల కవిత్వం ఈ ప్రదర్శనలో జీవం పోసుకుని ఆహూతులను అలరించనుందని వివరించారు. సీనియర్ సిటిజన్స్‌కు ప్రవేశం ఉచితమని తెలిపారు. ఇతరులకు నామమాత్రపు రుసుముతో ప్రవేశం కలిపిస్తున్నట్టు, టికెట్ల కోసం ఆన్‌లైన్‌లో www.boo kmyshow.com లో బుక్ చేసుకోవచ్చని సూచించారు.

వలసకార్మికులపై యువకుల దాడి

దుండిగల్,జనవరి13 : అల్లరి మూకల చేతిలో ఇద్దరు వలసకార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సుభాశ్‌నగర్ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ రాంలీలా మైదానంలో ఈనెల 11న సాయంత్రం స్థానికంగా ఉండే లోకేశ్, లలిత్ అనే ఇద్దరు యువకులు రాంలీలా మైదాన్‌లో క్రికెట్ ఆడుతున్నారు. ఈ క్రమంలో గ్రౌండ్ పక్కనే ఉన్న ఓ ఇంట్లో బాల్ పడింది. వెంటనే అక్కడకు వెళ్లిన లోకేశ్, లలిత్ ఇంట్లో బాల్ పడింది ఇవ్వమంటూ అందులో నివాసముంటున్న బీహార్‌కు చెందిన పెయింటింగ్ వర్కర్‌లు సంతోష్,రాజ్‌కుమార్‌లతో గొడవపడ్డారు.గొడవ ముదరడంతో లలిత్ అనే యువకుడు గోడదూకి బీహార్ వాసులపైకి దూసుకెళ్లాడు.ఈ నేపథ్యంలో లిలత్ తన ఫ్రెండ్ అమోల్‌కు ఫోన్‌చేసి ఘటన జరుగుతున్న చోటుకు పిలిపించుకున్నారు. ముగ్గురు స్నేహితులు కలిసి పెయింటర్‌లపై కత్తులతో దాడికి దిగారు. ఈ ఘటనలో సంతోష్ తీవ్రంగా గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.అయితే ఈ కేసులో కొందరు నేతలు తలదూర్చి కేసునమోదు కాకుండా విశ్వప్రయత్నం చేసినట్లు తెలుస్తుంది. దాని ఫలితంగానే దాడి జరిగిన రెండు రోజుల అనంతరం కేసు నమోదైనట్లు తెలుస్తుంది.

ఘనంగా భోగి పండుగ

మైలార్‌దేవ్‌పల్లి: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సంబురాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళలు ఇంటి ముందు పెద్ద ఎత్తున రంగు రంగుల ముగ్గులను వేసి సంక్రాంతికి స్వాగతం పలికారు. మొదటి రోజు భోగి సందర్భంగా ప్రజలు తమ ఇళ్లల్లోని పాత వస్తువులను తీసుకొచ్చి భోగి మంటలు వేశారు.